క్లుప్తంగా

శిథిలావస్థలో గోమాత విగ్రహం



జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న గోమాత విగ్రహం

దాబాగార్డెన్స్: గౌతమ బుద్ధుని 'సాక్షి'గా ఆవు ఏడుస్తోంది. భోగి.. సంక్రాంతి.. కనుమ పండగలు పెద్ద ఎత్తున నిర్వహించుకున్నారు. కనుమ రోజున ఆవులను భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. అటువంటి గోమాత విగ్రహాన్ని నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ముందర ఏర్పాటు చేశారు. ఆ గోమాత ఆలనా పాలనా చూసే నాథుడు కరవయ్యాడు. ఎంతో విశిష్టత గల గోమాత విగ్రహం పెచ్చులూడి.. రంగులు వెలసిపోయి ఆవేదన వ్యక్తం చేస్తూ.. పలువురి కంట పడినా.. పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. అధికారులు.. సిబ్బందికి కనిపించలేదనుకుంటే.. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంటాయి. అప్పుడు కూడా ఎంతో మంది ప్రజా ప్రతినిధులు సమావేశాలకు హాజరవుతుంటారు. కనీసం వారికి కూడా గోమాత ఆవేదన కనిపించకపోవడం శోచనీయం.

హ్యూమన్ రైట్స్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాయుడు



దాబాగార్డెన్స్: హ్యూమన్ రైట్స్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జీఎం నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు సెల్ జాతీయ అధ్యక్షుడు కేజీఎస్ఎస్‌డీవీఆర్ కృష్ణ నియామక పత్రం గురువారం అందజేశారు. నాయుడు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యత అప్పగించిన సెల్ జాతీయ అధ్యక్షుడికి నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. హ్యూమన్ రైట్స్ సెల్ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌కు నరవ



దాబాగార్డెన్స్: తిరువనంతపురంలో భారత ప్రభుత్వ విశ్వ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జాతీయ వర్క్‌షాప్‌కు నగరానికి చెందిన సామాజిక కార్యకర్త నరవ ప్రకాశరావుకు ఆహ్వానం అందింది. నగరానికి చెందిన స్వాంతన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రజ్ఞాన్‌కుమార్ కూడా ఈ వర్క్‌షాపుకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ఫోరం అధ్యక్షురాలు డాక్టర్ శశికళ వారిని అభినందించారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు ఈ నెల 17 నుంచి 23 వరకూ మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆరాధన ట్రస్ట్ ప్రతినిధులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. ఈ ఏడాది ఏడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. తొలి రోజు 17న తమిళనాడు సంగీత, లలిత కళల విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, ప్రముఖ వీణ విద్వాంసురాలు వీణా ఈ.గాయత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రెండో రోజు 18 ఉదయం 7 గంటలకు స్థానిక త్యాగరాజ ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన తర్వాత శ్రీ సీతారామ పరివారాన్ని ఊరేగింపుగా కళాభారతి చుట్టూ, వందలాది కళాకారులు గానం చేస్తుండగా కోలాటం, నాదస్వర వాయిద్యాలతో, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు త్యాగరాజ వేషధారణలో భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం 200 మంది పైగా సంగీత విద్వాంసులు ఘనరాగ పంచరత్న కీర్తనలు ఆలపిస్తారని తెలిపారు.



రోడ్డుపై చేపల వ్యాపారం

చేపల బేజార్

ప్రజలను బెంబేలెత్తిస్తున్న ఫిష్ మార్కెట్

వ్యర్థాలు.. దుర్గంధంతో ఇబ్బందులు

పట్టించుకోని సంబంధిత అధికారులు



వాహనాలు వెళ్లిపోయిన తర్వాత రహదారిపై పెట్టిన చేపల దుకాణాలు



రహదారిపై పార్కింగ్ చేసిన ఆటోలు



పాతబస్టాండ్ రహదారిలో హడావుడి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు ఫ్రూట్ మార్కెట్ వద్ద గల చేపల **మార్కెట్ అంటేనే పాదచారులు,** వాహన చోదకులు **బెంబేలెత్తిపోతున్నారు. అక్కడ** రహదారికి అడ్డం**గా లారీలు, ఆటోలు ఇష్టానుసా**రంగా పార్కింగ్ చేస్తున్నారు. వాటిని తప్పించుకుని ముందుకు వెళ్లే సరికి చేపలు తీసుకొచ్చే వ్యాన్లు రహదారి అంతా తిష్ట వేసుకు కనిపిస్తాయి. దాంతో పాటు దుర్గంధం ముక్కుపుటాలను అదరగొడుతుంది. ఇది చాలదన్నట్లు రహదారికి అడ్డంగా చేపల దుకాణాలు ఆ ప్రాంతాన్ని పద్మవ్యూహంలా మార్చేస్తాయి.

నాలుగు రోజులు తిప్పలు తప్పవు..

జాలారిపేట, షిఫింగ్ హార్బర్ వద్ద కూడా ఇంత సమస్య ఉండదు. పాత బస్టాండ్ వద్ద ఉన్న ఈ మార్కెట్ ఆదివారం, మంగళవారం, బుధవారం, శుక్రవారం నిర్వహిస్తుంటారు. ఈ నాలుగు **రోజులు ఆ దారిలో ప్రయాణించాలంటే సామాన్యులు హడలిపోతున్నారు. శనివారం రాత్రే ఉభయ గోదావరి జిల్లాల నుంచి చెరువు చేపలు వస్తాయి. ఆదివారం తెల్లవారి నాలుగు గంటల** నుంచి వ్యాపారాలు మొదలవుతాయి. అయితే వ్యాపారాల వరకు బాగానే ఉంది కానీ.. చేపలు పాడవకుండా వాహనాల్లో వేసిన ఐస్ అంతా రహదారిపై పడి చేపల నీటితో పాటు కారీ దుర్గంధం వ్యాపిస్తోంది. అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితి నెలకొంటుంది. దోమలు పెరిగిపోయి వ్యాధులు ప్రబలుతున్నట్లు అక్కడుండే వ్యాపారులు, స్థానికులు వాపోతున్నారు.

రహదారిపైనే వాహనాలు..

ఒక పక్క చేపల లోడుతో వచ్చిన వాహనాలు.. మరోపక్క హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్‌కు చెందిన వాహనాలను రహదారికి అడ్డంగా నిలిపి ఉంచడం **వల్ల అటుగా వెళ్లే వాహన చోదకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా దగ్గరలోని పోర్టుకు వెళ్లే ఉద్యోగులు సమయానికి విధులకు వెళ్లలేకపోతున్నామని చెబుతున్నారు.** ఈ సమస్యపై దృష్టి సారించాల్సిన పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

దుర్వాసన.. ఆపై వ్యాధులు..

ఫ్రూట్‌మార్కెట్‌లో కుళ్లిపోయిన పండ్లు, ఐస్‌తో తీసుకొచ్చిన చేపల నీటి వల్ల సమీపంలో ఉన్న ప్రసాద్‌గార్డెన్స్, దుర్గమాంబ సమాజంలో ఉన్న ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నామని మండిపడుతున్నారు. వ్యాపారులు స్థానికులు కాకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యాపారం చేసుకుని రహదారిపై, కాలువల్లో వ్యర్థాలు పారబోసి వెళ్లిపోతున్నారని ఆరోపిస్తున్నారు. దీని వల్ల దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని.. తాము వ్యాధులకు గురవుతున్నామంటున్నారు.

దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నాం..



చేపల వ్యాపారులు ఈ ప్రాంతాన్ని గలీజు చేసి, వ్యాపారాలు చేసుకుని వెళ్లిపోతున్నారు. దుర్గంధంతో కూడిన చేపల నీరు దుకాణాల్లోకి వచ్చి ఇబ్బంది పడుతున్నాం. దోమలు ప్రబలి **వ్యాధులకు గురవుతున్నాం.** ఈ సమస్యను అధి**కారులు పరిష్కరించాలి.**

– ఎండీ ఐషీర్, స్క్రాప్ వ్యాపారి, చేపల **మార్కెట్,** జీవీఎంసీ 35వ వార్డు

చర్యలు తీసుకుంటాం..



ప్రజారోగ్యం దృష్ట్యా చేపలు, ఫ్రూట్‌మార్కెట్ వద్ద వ్యర్థాలు పడకుండా చర్యలు తీసుకుంటాం. వండ్ల వ్యాపారులు వ్యర్థాలను దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకుని అందులోనే వేయాలి. చేపల లోడుతో వచ్చే వాహనాలు దూరంగా పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం. మల్లయ్యనాయుడు, జీవీఎంసీ జోన్–4 కమిషనర్ సూర్యాబాగ్

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి యువకుడి తరలింపు



ఆర్‌పీఎఫ్ పోలీసులతో భూషణ్‌కుమార్

సీతమ్మధార: బీహార్‌లోని పుల్లట్ట తాలూకా సీతమరి గ్రామానికి చెందిన భూషణ్‌కుమార్ (20) తమిళనాడులోని సేలం నుండి బీహార్ వెళ్లే రైల్లో ప్రయాణిస్తూ విశాఖ రైల్వేస్టేషన్‌లో దిగిపోయాడు. అతను అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆర్‌పీఎఫ్ సిబ్బంది గమనించారు. అతని మానసిక స్థితి సరిగా లేదని గ్రహించి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఏయూటీడీ సిబ్బంది ఆ యువకుడికి నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించి యువకుడి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సమాచారం అందించారు. వారు మూడు రోజుల్లో వచ్చి యువకుడిని తీసుకెళ్తామని చెప్పారని ఏయూటీడీ సిబ్బంది తెలిపారు.

రహదారిపై మురుగుతో ఇక్కట్లు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

దాబాగార్డెన్స్: జిల్లా పరిషత్ సమీపాన గల శ్రీ కృష్ణ చైతన్య మఠం సమీపంలో భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. ఈ మార్గానే ఎంతో మంది ప్రజా ప్రతినిధులు జిల్లా పరిషత్‌కు వెళ్తున్నారు. ఉద్యోగులు.. సిబ్బంది కూడా ఇటుగానే ప్రయాణిస్తుంటారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులకు వెళ్లే వారు ఈ రహదారి గుండా వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. రక్తసేకరణకు వెళ్లే రోగుల బంధువులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కానీ ఆ వార్డు కార్పొరేటర్‌కు ఏ మాత్రం పట్టినట్టు లేదు. పక్షం రోజులుగా భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లి ఇంత మందిని ఇబ్బందులు పెడుతుంటే కార్పొరేటర్ గానీ.. జీవీఎంసీ సిబ్బంది గానీ పట్టించుకోకపోవడం శోచనీయం.

తాబేళ్ల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సముద్ర తాబేళ్ల పరిరక్షణకు అందరి సహకారం అవసరమని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. సముద్ర తాబేళ్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలు, సుస్థిర చేపల వేట విధానంపై కలెక్టర్ గురువారం సమీక్షించారు. పలు శాఖల అధికారులు, శాస్త్ర వేత్తలు, ఫిషింగ్ బోట్ యజమానుల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆడ తాబేళ్లు నవంబర్, ఫిబ్రవరి మధ్యలో తీరానికి వచ్చి గుడ్లు పెడతాయన్నారు. ఇటీవల సముద్ర తాబేళ్ల మృత కళేబరాలు తీరానికి చేరడం గమనిస్తున్నామని, అవి చేపల వేట సమయంలో వలల్లోను, సముద్రంలో విడిచిపెట్టే తెగిపోయిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో చిక్కుకుని మరణిస్తున్నాయని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఇలాంటి పరిణామాల వల్ల భవిష్యత్తులో ఆలీవ్ రిడ్లే రకపు తాబేళ్లు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తాబేళ్లు తప్పించుకునే అవకాశం ఉన్న టీఈడీ పరికరాన్ని వినియోగించాలన్నారు. వన్య మృగ సంరక్షణ చట్టం – 1972 ప్రకారం తాబేళ్లను చంపడం, తినడం, అమ్మడం, రవాణా చేయడం నిషేధం అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ జిల్లా అధికారి శ్రీవాణి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, కేంద్ర మత్స్య సంస్థల ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జోయ్ కిజాకుద్దీన్, ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) జోనల్ డైరెక్టర్ భామిరెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ నాయక్, మెరైన్ సీఐ దివాకర్, మత్స్యశాఖ ఏడీ విజయ కృష్ణ, పోలీసు అధికారులు, నెట్ ఫిష్ స్టేట్ కో–ఆర్డినేటర్ హన్మంతరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆషాజ్యోతి, డాల్ఫిన్ మెకనైజ్డ్ బోటు యజమానుల సంఘ అధ్యక్షుడు వీర్రాజు, సంప్రదాయ బోట్ల ప్రతినిధి జి.యల్లయ్య (కింగ్) తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న యూటర్న్



ప్రమాదకరంగా వున్న యూటర్న్ వద్ద వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు ఆశీలమెట్టలోని సబ్‌వేలో రెండు వైపుల వాహనాల రాకపోకలతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా ఇక్కడి జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న యూటర్న్ ప్రమాదభరితంగా మారినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ ఎవరైనా యూటర్న్ తిరుగుతుంటే రామా టాకీస్ మార్గం నుంచి వచ్చే వాహన చోదకులు కొద్ది సేపు ఆగిపోవలసి వస్తుంది. శ్రీ చైతన్య కళాశాల మార్గం నుంచి యూటర్న్ వద్ద మలుపు తిరిగి రామా టాకీస్ వైపు వెళ్లే క్రమంలో ఈ మార్గంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఆగిపోవాల్సిందే. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రామా టాకీస్ వైపు వెళ్లే బస్సులు సబ్‌వే మీద నుంచి వెళ్తాయి. గతంలో ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంతో నాలుగేళ్ల క్రితం అప్పటి పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్హా ప్రమాదాలు జరగకుండా సబ్‌వే మార్గంలో వన్‌వే విధానం అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. తర్వాత మద్దిలపాలెం నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వైపు వెళ్లే వాహనాలు ఈ సబ్‌వే మార్గం ద్వారానే రాకపోకలు సాగించేవి. గత ఏడాది నుంచి రెండు వైపుల భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పైగా ఈ మార్గంలో వాహనాలు ఓవర్ టేక్ చేయకూడదు. అయినా కొందరు చేస్తున్నారు. దాంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సాటి వాహన చోదకులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా ద్వారకా స్టేషన్ ట్రాఫిక్ విభాగం అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వరమెట్ట పరస



రంగుల రాట్నం వద్ద చిన్నారుల సందడి



పరసలో జనసందోహం



విశేష అలంకరణలో బల్లిగిరి వెంకన్న



పరసలో చెరుకు గడల అమ్మకాలు



కళాకారుల తోడపెద్దు గరిడీ

అల్లిపురం: వేంకటేశ్వరమెట్ట పరస గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరోడ్డు, వేంకటేశ్వరమెట్ట ప్రాంతాల్లో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. వేంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట, సింహాలదేవిడి, అమ్మవారివీధి, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు ప్రాంతాలతో పాటు నగరంలో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు తరలి రావటంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. ఈ సందర్భంగా చిన్నారులు రంగుల రాట్నాలు, జంపింగ్ గేమ్స్‌తో సందడి చేశారు. చెరకు గడలు, పంచదార చిలకలు, రంగు రంగుల బొమ్మల దుకాణాల వద్ద చిన్నారులు సందడి చేశారు. బూరలు, వాయిద్యాలు, బెలూన్లు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపించారు. ఈ సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామిని చెరకు గడలతో అలంకరించారు.

19న వేమన జయంతి

సీతమ్మధార : వేమన జయంతి ఈ నెల 19న నిర్వహిస్తామని వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు బులుసు మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌కే బీచ్ రోడ్డులోని కాళీమాత దేవాలయం సమీపంలో 19 ఉదయం 9 గంటల నుంచి వేమన జయంతి వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, గురుమూర్తి రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలియజేశారు. అలాగే నగర ప్రజలు కూడా వేమన జయంతి వేడుకల్లో పాల్గొనాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అదే రోజు ఉదయం ఆశీలమెట్టలోని వేమన మందిరం ఆవరణలో గల వేమన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అతిథులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

పండగ వేళ.. ఫుల్ ఖుషీ





రెండు రోజుల క్రితం వరకు రద్దీగా కనిపించిన జగదాంబ కూడలి ఇప్పుడు నిర్మానుష్యంగా మారిపోయింది. పండగలకు సొంతూళ్లకు జనం వెళ్లిపోవడంతో రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. గురువారం ఖాళీగా దర్శనమిచ్చిన జగదాంబ కూడలిని చిత్రంలో చూడవచ్చు. అలాగే పండగ నేపథ్యంలో 'ఫుల్'గా ఖుషీ చేసిన చాలా మంది రోడ్లపై పలుచోట్ల కనిపించారు. గురువారం ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో పూటుగా మద్యం సేవించిన ఒక వ్యక్తి ఇలా రహదారిపై దొర్లుతూ 'సాక్షి'కి కనిపించాడు.

– ఏయూక్యాంపస్/ఫొటోలు సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

భారీ స్పీడ్ బ్రేకర్‌తో ప్రమాదాలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడి ఏఎంజీ ఆస్పత్రి సమీపంలో ఇటీవల జీవీఎంసీ జోన్ – 3 ఇంజినీర్లు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే వుంది. కానీ, ఈ స్పీడ్‌బ్రేకర్ వెడల్పు బాగా ఎక్కువగా వుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు స్పీడ్ బ్రేకర్ మీద రేడియం కలర్స్ లేకపోవడంతో రాత్రి పూట సక్రమంగా కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చే వాహనచోదకులు స్పీడ్‌బ్రేకర్‌ని గమనించలేక అవస్థలు పడుతున్నారు. వెడల్పు, ఎత్తు ఎక్కువగా ఉండడంతో ఈ స్పీడ్‌బ్రేకర్ వద్ద పగలు, రాత్రి తేడా లేకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే 20కి పైగా ప్రమాదాలు జరిగాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఫలితంగా పలువురు వాహనచోదకులు గాయాలపాలవుతున్నారని ఆందోళన చెందుతున్నారు. స్పీడ్‌బ్రేకర్లు కనిపించేలా రేడియం కలర్స్ వాడకపోవడం దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇక్కడికి సమీపంలో వాహనాలు మరమ్మతులు చేసే దుకాణాల కారణంగా ఈ మార్గంలో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు వాపోతున్నారు. తహసీల్దార్ ఆఫీసు, కేఆర్ఎం కాలనీ ప్రాంతాలకు ఈ మార్గం ద్వారానే ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి స్పీడ్ బ్రేకర్‌కి రంగులు ఏర్పాటు చేయాలని, వెడల్పు తగ్గించాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.